## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 30-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ తెలుగు తల్లికి జలహారతి ప్రాజెక్టుతో రాష్ట్రమంతా జల అనుసంధానం జరుగుతుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.
- ❖ కూటమి ప్రభుత్వ హయాంలో దేశం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తోందని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు.
- ❖ వెనుకబడిన తరగతుల అభ్యున్నతి కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.
- ❖ కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసి ఉన్న నిధులను తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాధ్ తెలియజేశారు.

===============================

రాష్ట్రంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఈరోజు జరిగిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ…. గండికోట, సోమశిల విస్తరణ, కండలేరు వంటి ప్రాజెక్టులు ముందుకు తీసుకువెళ్లామని పేర్కొన్నారు. తెలంగాణలో 7 మండలాలను రాష్ట్రంలో విలీనం చేశామని గుర్తు చేశారు. రాయలసీమకు నీరు వస్తే కోస్తా జిల్లాలతో పోటీపడుతుందన్నారు. నాగార్జున్ సాగర్ నుంచి వెలుగొండ ఆయకట్టు ద్వారా బనకచర్ల నుంచి నల్లమల టన్నల్ ద్వారా నీరు తీసుకెళ్లవచ్చని, దీనికి నదులు, రిజర్వాయర్లు అనుసంధానం చేయవచ్చని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల 80 లక్షల మందికి తాగునీరు, 7.5 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రమంతా అనుసంధానం అవుతుందని, ఈ ప్రాజెక్టును తెలుగుతల్లికి జలహారతి అని పిలుస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ…

(వాయిస్ 35 సెకన్లు)

===============================

ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలో దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తోందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. ఆయన ఈరోజు తిరుమల సందర్శించి, శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.... ప్రధానమంత్రి నరేంద్రమోడీ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని చెప్పారు. ఎన్డీయే ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తుందని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

================================

ఎన్డీయే కూటమి ప్రభుత్వం చేతల ప్రభుత్వమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా బీసీ వ్యక్తి అయిన విజయానంద్ నియామకం నారా చంద్రబాబు నాయుడుకు, ఎన్డీయే ప్రభుత్వానికి బీసీలపై ఉన్న గౌరవాన్ని వెల్లడిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరిగిందని, బీసీలపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోనే ప్రధానమైన, బాధ్యతాయుతమైన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గాను, ప్రపంచ వ్యాప్తంగా కొలిచే అత్యంత పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో గాను బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులను నియమించడం హర్షణీయమని వ్యాఖ్యానించారు. ఎన్డీయే ప్రభుత్వం భవిష్యత్‌లో బీసీలకు మేలు చేకూర్చే పథకాలు మరిన్ని ప్రవేశపెట్టనుందని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

================================

రాష్ట్రంలో పోలీసు స్టేషన్‌లు, జైళ్ల అభివృద్ధి ఇంకా జరగాల్సి ఉందని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ అన్నారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితతో కలిసి ఈరోజు ఆయన సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రావలసిన బకాయిలు, నిధులపై ఈ సమావేశంలో చర్చించారు. అలాగే... పోలీస్, అగ్నిమాపక సేవలు, జైళ్లు, విపత్తుల నిర్వహణ, జిల్లా సైనిక సంక్షేమం మొదలైన వాటికి సంబంధించిన పథకాల నిధులు కేంద్రం నుండి తీసుకురావడంపై చర్చలు జరిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ... రాష్ట్రానికి గ్రే హౌండ్స్, ఆంధ్రప్రదేశ్ పోలీస్ అకాడమీ (అప్పా) సంస్థలు రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్రానికి 118 సంస్థలు రావాల్సి ఉందని... ఈ అంశాలపై దృష్టి పెట్టామని ఆయన చెప్పారు.

================================

వచ్చే నెల 5వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మెగా జాబ్ మేళా జరగనుందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు ఆమె క్యాంపు కార్యాలయం వద్ద జాబ్ మేళా పోస్టరును ఇతర అధికారులతో కలిసి ఈరోజు విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గంలోను మెగా జాబ్ మేళాలను నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన, శిక్షణ అందించేందుకు చర్యలు చేపడుతోందని చెప్పారు.

విరామం

================================

తూర్పు గోదావరి జిల్లాలో 2024 సంవత్సరంలో నేరాలు, నేర కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ నరసింహ కిషోర్ తెలిపారు. ఈ సంవత్సరంలో 7 వేల 437 ఎఫ్.ఐ.ఆర్ లు నమోదయ్యాయని, ఇవి గత సంవత్సరం కంటే 8 శాతం తక్కువ అని చెప్పారు. హత్యలు కూడా 8 శాతం తగ్గినట్టు తెలిపారు. మహిళా రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, నేరస్తుల్ని పట్టుకోవడంలో డ్రోన్లు వినియోగిస్తున్నామని అన్నారు. జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని ఎస్పీ ఈ సందర్భంగా వెల్లడించారు.

(వాయిస్ 35 సెకన్లు)

నంద్యాల పట్టణంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో స్థానిక టక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు పోలీసులు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని పోలీస్ సబ్ డివిజన్ ల పరిధిలో బైక్ ర్యాలీ నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు.

================================

దేశంలో జరుగుతున్న అభివృద్ధిని ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయని కేంద్ర ఆయుష్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా సహాయ మంత్రి ప్రతాప్ రావ్ జయదేవ్ అన్నారు. తిరుపతి జిల్లాలోని శ్రీ కాళహస్తీశ్వర ఆలయాన్ని కేంద్ర సహాయ మంత్రి ఈరోజు సందర్శించారు. అనంతరం ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తిగా ప్రజాసేవకు అంకితమయ్యారని చెప్పారు. దేశానికి ప్రధానమంత్రి చేస్తున్న సేవలను ప్రజలతో పాటు ప్రపంచ దేశాధినేతలు కూడా గుర్తిస్తున్నారని చెప్పారు. నరేంద్రమోదీ హయాంలో దేశంలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ దేశ ప్రజలకు వరాలుగా మారుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

================================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వెనుకబడిన తరగతుల వారికి ఎల్లప్పుడూ సమున్నత గౌరవం లభిస్తుందని రాష్ట్ర బీసీ, చేనేత, జౌళి శాఖాల మంత్రి ఎస్. సవిత అన్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన విజయానంద్‌ను నియమించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులుగా 8 మంది బీసీలకు అవకాశమిచ్చారని, సీనియర్ బీసీ నేత చింతకాలయ అయ్యన్న పాత్రుడిని శాసన సభాపతిగా నియమించారని అన్నారు. అలాగే... కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రిగా అవకాశమిచ్చారని, తెలుగుదేశం రాష్ట్ర పార్టీ అధ్యక్షునిగా పల్లా శ్రీనివాస్ కు అవకాశం ఇచ్చారని చెప్పారు. డీజీపీ ద్వారకా తిరుమలరావు, టీటీడీ చైర్మన్ శ్యామలరావు కూడా బీసీలు కావడం గర్వకారణమని అన్నారు.

================================

ప్రజలకు సేవ చేయడంలో పోలీస్ శాఖ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తుందని విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖర్ బాబు తెలిపారు. వార్షిక నేర సమీక్షా సమావేశం పోలీస్ కమాండ్ కంట్రోల్ కాన్ఫరెన్స్ హాల్ లో ఈరోజు... కమిషనర్ ఎస్వీ రాజ శేఖర్ బాబు ఆధ్వర్యంలోజరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ 2024 వార్షిక నేర సమీక్షను విడుదల చేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ సంవత్సరం ఎన్నో సవాళ్లను ధీటుగా ఎదుర్కొని విజయాలను సాధించమన్నారు. వరదల సమయంలో కూడా పోలీసు శాఖ సమర్ధవంతంగా పని చేసిందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలను నియంత్రిస్తున్నామని తెలిపారు. నేర నియంత్రణ, ప్రమాదాల నివారణలో డ్రోన్లు ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పారు.

================================

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అన్నారు. సాలూరు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు.

================================
================================